సాక్షి తిరుపతి

బుధవారం । 26 । మార్చి । 2025



మెట్లోత్సవంలో పాల్గొనడం పుణ్యఫలం

మెట్లోత్సవంలో పాల్గొనడం పుణ్యఫలమని అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు రావుగోపాలరావు అన్నారు. - IIలో



హరి.. విరిసిరి

శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పుష్ప యాగం వైభవంగా నిర్వహించారు. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం (ఉ)
తిరుపతి	6-27	4-53
గూడూరు	6-22	4-49

న్యూస్‌రీల్

దైవభాష అభ్యసనం మహాదృష్టం



వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులు, అధికారులు

తిరుపతి సిటీ: సంస్కృత భాషకు నిలయమైన ఎన్‌ఎస్‌యూలో దైవభాషను అభ్యసిస్తున్న, అధ్యయనం చేస్తున్న విద్యార్థులు అదృష్టవంతులని బెంగళూరు డీఆర్‌డీఓ ప్రముఖ శాస్త్రవేత్త ఎల్‌ఎస్ రాఘవేంద్ర కొనియాడారు. జాతీయ సంస్కృత వర్సిటీలో మంగళవారం వర్సిటీ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. సంస్కృతంలో నిక్షిప్తమైన భారతీయ సంస్కృతి ఆధునిక సమాజానికి మార్గదర్శిగా ఉందన్నారు. సంస్కృత భాష ఔన్నత్యం విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత విద్యార్థులు, అధ్యాపకులపై ఉందన్నారు. వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృత అధ్యయన, అధ్యాపన విషయంలో ఉత్తమ జ్ఞానాన్ని విద్యార్థులకు, ప్రజలకు అందిస్తూ భారతీయ సంస్కృతిని, సంస్కృత భాషను సంరక్షిస్తూ ప్రాచీన భాషతో పాటు ఆధునిక సాంకేతిక విషయాలను వర్సిటీ విద్యార్థులకు నేర్పిస్తూ ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. అనంతరం పలు క్రీడా, సాంస్కృతిక పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్, కే వెంకట నారాయణరావు, డీన్లు సి దక్షిణమూర్తి శర్మ, సి రంగనాథన్, రజనీకాంత్ శుక్లా, అధ్యాపకులు నాగరాజు, ఉదయనా హెగ్డే, లీనాచంద్ర, సేతురాం, వైష్ణవి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూ ఏటిజిహెచ్ వద్దకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 58,358 మంది స్వామివారిని దర్శించుకోగా 27,024 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.45 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

మహిళావర్సిటీలో యూఎస్ కౌన్సిలేట్ జనరల్



వర్సిటీ అధికారులతో యూఎస్ కౌన్సిలేట్ జనరల్

తిరుపతి సిటీ: యూఎస్ కౌన్సిలేట్ జనరల్ డిప్లమసీ ఆఫీసర్ ఎమిలియా బి స్మిత్, పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ స్పెషలిస్ట్ సెంథిల్ కుమార్ మంగళవారం మహిళా వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజిని, డీన్లు విజయలక్ష్మి, భారతి, శారద, అధ్యాపకులతో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణపై చర్చించారు. ప్రధానంగా ప్రభుత్వ నిధులతో త్వరలో రానున్న ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఫెలో ప్రోగ్రామ్‌పై చర్చించారు. విద్యార్థులకు, రీసెర్చ్‌స్కాలర్స్‌కు, యువ అధ్యాపకులు ఉపాధి నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, అకడమిక్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ భాషపై శిక్షణ ఇవ్వడానికి ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ముద్రపడదు.. ముద్ద దొరకదు

అసలే నూర్పిళ్లు.. పరీక్షల కాలం..ఆపై పనుల భారం.. పిల్లలకు పరీక్షల ఒత్తిడి.. క్షణం తీరిక లేని సమయం.. అలసి సొలసి ఏ రాత్రికో కానీ ఇల్లు చేరని వైనం.. ఈ స్థితిలో కార్డులదారుల మెడపై ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్(ఈకేవైసీ) ఆదేశం.. అదీ కేవలం 11 రోజులే టైమ్.. ఈ లోపు ముద్ర పడకుంటే ముద్ద దొరకదు..ఖాయం.. ఇదీ కాలకూటమి అల్టిమేటం.. దీంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. పనులు మానుకుని రేషన్‌షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. అప్పటికీ ఐదేళ్ల లోపు పిల్లలు, వృద్ధులకు వేలిముద్రలు పడడం లేదు.. దీంతో ఎక్కడ కార్డు రద్దు అవుతుందో.. పథకాలకు అన్నీ అర్హత ఉన్నా అనర్హులవుతామోనని అతి తక్కువ కాలంలో ఇలా చేయడమేమిటని ప్రజలు మండిపడుతున్నారు.



తిరుపతిలో ఈకేవైసీ చేయించుకోవడానికి రేషన్‌దుకాణం వద్ద క్యూకట్టిన కార్డుదారులు



రేషన్ కార్డుదారులపై ఈకేవైసీ కత్తి

- ప్రజలను పరుగులు పెట్టిస్తున్న సర్కార్
- రేషన్ డీలర్ల చుట్టూ ప్రదక్షిణలు
- ఈ నెల 31 వరకే గడువు
- ఎలా సాధ్యమని జనం ఆవేదన

తిరుపతి అర్బన్: కూటమి సర్కార్ రేషన్ కార్డుదారులపైనా విషం చిమ్ముతోంది. తాజా కేవలం 11 రోజుల్లోపు రేషన్‌కార్డుదారులందరూ ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్(ఈకేవైసీ) చేయించుకోవాలనే నిబంధన విధించింది. దీంతో బిజీబిజీగా ఉండే మార్చిలో పనులు ఆపుకుని ఎలా ఈకేవైసీ చేయించుకోవాలో తెలియక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 6,03,000 రేషన్‌కార్డులు ఉండగా అందులో 18.70 లక్ష మంది సభ్యులుగా ఉన్నారు. వీరికి ప్రతి నెలా 8,350 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా అవుతుంది. వీరంతా జిల్లాలోని 1,457 చౌకదుకాణాల్లో ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఇంత మంది ఈకేవైసీ చేయించుకోవాలంటే కనీసం రెండు నెలలపాటు గడువు ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ నెల 20వ తేదీ ఈకేవైసీ మొదలుపెట్టి 31వ తేదీలోపు చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అంటే కేవలం 11 రోజుల్లో

కార్డుల తొలగింపునకు కుట్రేనా?

కూటమి సర్కార్ పారదర్శకత పేరుతో రేషన్‌కార్డులు తొలగించడానికి కుట్ర చేస్తోందని కార్డుదారులు మండిపడుతున్నారు. నిత్యావసర సరుకుల పంపిణీలో జరుగుతున్న వ్యత్యాసాలు, అవకతవకలు నివారించేందుకు అంటూ కొత్త విధానాన్ని తీసుకొచ్చామని ప్రభుత్వం చెబుతోంది. ఈ నెలాఖరులోపు కార్డులో ఉన్న కుటుంబ సభ్యులంతా విధిగా ఈకేవైసీ చేయించుకోకపోతే ఏప్రిల్ నెల సరుకులు అందవని రెవెన్యూ అధికారులు వెల్లడించడంతో కార్డుదారుల్లో ఆందోళన నెలకొంది. రేషన్ నిలిపేస్తారో... లేక రేషన్‌కార్డును రద్దు చేస్తారోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రేషన్‌కార్డు లేకుంటే పథకాల్లో కోత తప్పదని హెచ్చరికలు జారీ అవుతున్నాయి. దీంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. రేషన్ కార్డు పథకాలతోపాటు అన్నింటికి మూలాధారమంటూ పలువురు ఆందోళన చెందుతున్నారు.

ఆది నుంచి టెన్షన్

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు టెన్షన్ తప్పడం లేదు. అధికారంలోకి వచ్చిన మొదటి రెండు నెలల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, రేషన్ డీలర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘమిత్రలు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ఇలా అన్ని విభాగాల్లోనూ వందలాది మంది ఉద్యోగాలు తొలగించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కూటమి సర్కార్ సామాజిక భద్రత పింఛన్ల తొలగింపుపై దృష్టి సారించింది. గత ఏడాది జూలైలో 2,71,182 మందికి పింఛన్లు అందించగా ఈ ఏడాది మార్చిలో 2,62,873 మంది పింఛన్లు ఇచ్చారు. అంటే 8,309 మందికి పైగా పింఛన్లు తొలగించారు. అది చాలదన్నట్లు వచ్చే ఏప్రిల్ 30 వరకు పింఛన్ల తనిఖీలు చేస్తున్నారు. అంతేకాదు జిల్లాలో పదికి పైగా వివిధ పేర్లతో సచివాలయ ఉద్యోగులు ఇంటింటా సర్వేలు చేస్తున్నారు. ఓటీపీలు చెప్పాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటికి కరెంట్ చార్జీల నుంచి ఫ్రిజ్, టీ, వాహనాలు, ప్లాట్స్, ఇండ్లు తదితర ఆస్తుల వివరాలు సైతం వివరించాల్సి వస్తుంది. దీంతో ఏది ఏ పథకానికి ముప్పు వస్తుందోనని అందరికీ ఆందోళన తప్పడం లేదు.

నూర్పిళ్ల కాలం ఎలా?

రబీ సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా జోరుగా వరిపాటు ఇతర పంటల నూర్పిళ్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రైతులు కుటుంబ సమేతంగా పొలాల్లోకి వెళ్లి క్షణం తీరిక లేకుండా పనులు చేసుకుంటున్నారు. దీనికితోడు కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలతోనూ పంట నూర్పిళ్లకు ఇక్కట్లు పడుతున్నారు. కొందరు పిల్లలు వివిధ కళాశాల్లో దూర ప్రాంతాల్లో చదువుకుంటున్నారు. ఇంకొందరు ఉపాధి నిమిత్తం చిన్న చిన్న పనుల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లినవారు ఉన్నారు. ఇలాంటి పరిస్థితిలో కేవలం 11 రోజులు గడువు ఇస్తే ఎలా అంటూ పలువురు మండిపడుతున్నారు. అయినా ఈకేవైసీ చేయించుకోకుంటే రేషన్‌కార్డు కట్ చేస్తే తమకు సంబంధం లేదంటూ కొందరు రేషన్ డీలర్లు హెచ్చరిస్తున్నారు.

జిల్లా సమాచారం

రేషన్ దుకాణాల సంఖ్య	1,457
కార్డుల సంఖ్య	6,03,000
కార్డులో సభ్యుల సంఖ్య	18.70 లక్షలు
ప్రతి నెలా బియ్యం	8,350 మెట్రిక్ టన్నులు
ఎండీయూ వాహనాల సంఖ్య	369
అందుబాటులో ఉండే ఎండీయూ వాహనాలు	190

18.70 లక్షల మంది చేయించుకోవాల్సి ఉంది. ఇలా ఎలా సాధ్యమని? అంతా చర్చించుకుంటున్నారు.

పిల్లలకు ఈకేవైసీ కష్టాలు

పిల్లలకు ఈకేవైసీ కష్టాలు తప్పడం లేదు. ఐదేళ్లు దాటి వేలిముద్ర అప్‌డేట్ చేయించుకోని పిల్లలను ఇప్పుడు ఈకేవైసీ వేధిస్తోంది. దీంతో వారి తల్లిదండ్రులు ఆధార్ సెంటర్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. మరోవైపు ఐదేళ్లకు పైబడి 12–13 ఏళ్ల లోపు పిల్లలు, 70 ఏళ్లకు పైబడిన వృద్ధులకు ఈకైవైసీ నమోదు కావడం లేదు. సర్వర్ సమస్య వేధిస్తోందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

కొత్త కార్డులకు 50 వేల దరఖాస్తులు

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో 50 వేల మందికిపైగా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే మరో 40 వేల మందికిపైగా రేషన్ కార్డుల్లో తప్పుల సవరణ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. కొత్త కార్డులు ఇవ్వకపోగా..ఉన్న రేషన్ కార్డులను ఎలా తొలగించాలనే కుట్రలో భాగంగా పలు ప్రయత్నాలు చేస్తున్నారు.

రెండు నెలలు గడువు ఇవ్వండి



రైతులు, రైతు కూలీలు జోరుగా వ్యవసాయం పనుల్లో ఉన్నారు. ఉదయం వెళితే రాత్రికి ఇంటికి వస్తున్నారు. ఈ సందర్భంలో రేషన్ డీలర్ వద్ద క్యూకట్టాలంటే వీలుకాదు. అయితే ఈకేవైసీ చేయించుకోకుంటే రేషన్ కట్ అవుతుందని ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదు. తప్పకుండా రేషన్‌కార్డులోని సభ్యులంతా ఈకేవైసీ చేయించుకుంటారు. ఇందుకు రెండు నెలలు ఇవ్వాలి. హడావుడి చేయడం సరికాదు.

– కే.శ్రీనివాసులు, వాకాడు

కార్డు తొలగిస్తామనడం సరికాదు



ఈకేవైసీ చేయించుకోకుంటే రేషన్‌కార్డును తొలగిస్తారమంటూ చెప్పడం సరికాదు. గతంలో రైతులకు చెందిన విశిష్ట గుర్తింపు కార్డును పొందడంలోను 11 రోజులు మాత్రమే గడువు ఇచ్చి.. వెంటనే రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లను కలవాలని చెప్పడంతో అంతా పనులు మానుకుని, రైతు సేవా కేంద్రాల వద్ద క్యూకట్టారు. ఏదైనా సర్కార్ కొత్త పాలసీని తీసుకువస్తే అందుకు సమయం ఇవ్వాల్సి ఉంది. లేదంటే అంతా ఆందోళన చెందాల్సి ఉంటుంది.

– వెంకటేష్, రేణిగుంట

ఎక్కడైనా ఈకేవైసీ నమోదు



సొంత గ్రామాలకు దూరంగా ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు రాష్ట్రంలో ఎక్కడైనా, ఏ డీలర్ వద్ద నైనా ఈకేవైసీ చేసుకోవచ్చు. రేషన్ దుకాణాల్లోని ఈ పాస్ యంత్రాల్లోనే నమోదు చేసుకోవాలి. డీలర్లకు ఆ మేరకు ఆదేశాలు స్పష్టం ఇచ్చాం. ఆధార్ కార్డు సంఖ్య తెలియజేస్తే వేలిముద్ర వేయించుకుని నమోదు చేస్తారు. అప్పుడే సదరు వ్యక్తి కార్డులో సభ్యుడిగా ఉన్నట్లు గుర్తింపు లభిస్తుంది. ఈకేవైసీ తప్పకుండా నమోదు చేయించుకోవాల్సిందే.

– శేషాచలం రాజు, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి

విద్య..ఉపాధిలో ఏఐ పాత్ర కీలకం



వర్క్‌షాపులో పాల్గొన్న అతిథులు, వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: ఆధునిక ప్రపంచంలో విద్య, ఉపాధి రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం కీలకంగా మారుతోందని ఏపీ ప్రభుత్వ ప్రతినిధి భవానీ శంకర్ పేర్కొన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి మండలి, మైక్రోసాఫ్ట్ సంయుక్త సహకారంతో పద్మావతి మహిళా వర్సిటీ డీఎస్‌టీ క్యూరీ ఏఐ సెంటర్ ఆధ్వర్యంలో వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో మూడు రోజుల పాటు మైక్రోసాఫ్ట్ ఏఐ, నైపుణ్యాభివృద్ధి అనే అంశంపై జరగనున్న వర్క్‌షాప్‌ను ఆయన వర్సిటీ అధికారులు, అతిథులతో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంప్రదాయ, ఆన్‌లైన్ ద్వారా విద్యనభ్యసించడానికి రిమోట్ లెర్నింగ్‌కు తేడా ఉందన్నారు. సాంకేతిక విద్యతో విద్యార్థులను సాధికారపరచడం కోసం ఉమెన్ రాక్ ఇన్ ఐటీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం సాంప్రాసాఫ్ట్ సంస్థ సీఈఓ మల్లిక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంతటా 50 వేల మంది విద్యార్థులకు ఏఐపై శిక్షణ ఇవ్వాలన్న అంశంపై మైక్రోసాఫ్ట్ సంస్థ దృష్టి సారించిందన్నారు. ప్రపంచ ఉద్యోగ వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుచుకోవాలంటే విద్యతో పాటు ఏఐపై విద్యార్థినులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ టి సుధ, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డైరెక్టర్ మల్లికార్జున, ప్రొఫెసర్ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

నేడు న్యాయవాదులు విధులకు గైర్హాజరు

తిరుపతి లీగల్: తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ తిరుపతి న్యాయవాదులు బుధవారం విధులకు గైర్హాజరు కావాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళవారం న్యాయవాదుల సంఘ కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో న్యాయవాది ఇజ్రాయిల్‌ను నడిరోడ్డుపై హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తిరుపతి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గోపీచంద్, ప్రధాన కార్యదర్శి మార్టిన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ క్షయ నివారణ దినోత్సవ ర్యాలీ



బహుమతులు అందజేస్తున్న అతిథులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల ప్రాంగణం పల్మనాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ర్యాలీ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, ఐఎంఏ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీహరిరావు, జిల్లా టీబీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏడాది కాలంగా టీబీ వ్యాధి నివారణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన సిబ్బందికి, టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో ఎంపికై పంచాయతీలకు అతిథుల చేతుల మీదుగా అవార్డులు, బహుమతులు ప్రదా నం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిరాజు, డాక్టర్ ప్రేమనంద, డాక్టర్ ఆర్ఆర్ రెడ్డి, డాక్టర్ అజయ్, వైద్యులు భరత్, అనుపమ, ఉదయ్ పాల్గొన్నారు.

ఎవరి కోసం రోడ్డు నిర్మాణం?



- పెద్దలతోటకు రూ.15 లక్షలతో రహదారి
- అటవీ, చెరువు ప్రాంతాల్లో రోడ్డు

చిట్టమూరు: రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదువ లేదన్న నానుడిని పాటిస్తున్నారు కూటమి నేతలు. తమ అధికార బలంతో అధికారులను పక్కదారి పట్టించి, తమకు అనుకూలంగా ప్రభుత్వ నిధులు ఖర్చు చేయిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. ఇలాంటి సంఘటనే చిట్టమూరు మండలం ఎల్లసిరి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ గ్రామానికి సమీపంలో నాలుగు నియోజకవర్గాల్లో పెత్తనం చేస్తున్న కూటమికి చెందిన పెద్దాయన గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే ఎస్సీ, ఎస్టీల పొలాలతోపాటు ప్రభుత్వ భూములు సుమారు 500 ఎకరాలను తమ అధీనంలోకి తెచ్చుకుని, ఫామ్‌హౌస్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే అక్కడకు వెళ్లేందుకు పూర్తి స్థాయి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి సర్కారు ఇటీవల పల్లె పండుగ పేరుతో రహదారులు నిర్మిస్తుంది. ఇదే మంచి తరుణం అనుకున్న ఆ పెద్దాయన తమ ఫామ్‌హౌస్‌కు రూ.15 లక్షలతో మెటల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు అధికారులు కూడా జీ హుజూర్ అంటూ తలలు ఊపారు. నిబంధనలు పక్కపెట్టి కూటమి ప్రభుత్వానికి చెందిన పెద్దాయన తోటకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తున్నారు. అయితే ఇదే మండలంలోని బురదగాలి కొత్త పాళేనికి ఇలాంటి రహదారి ఉన్నా, దానినికి మాత్రం అటవీ ఆంక్షలు ఉన్నాయని, కనీసం తట్టెడు మట్టి కూడా వేయకుండా ఆ ప్రాంత వాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

అటవీ, చెరువు భూముల్లో రోడ్డు నిర్మాణం

చిట్టమూరు మండలంలోని మల్లాం– నాయుడుపేట రహదారికి మధ్యలో ఎల్లసిరి గ్రామానికి రోడ్డు ఉంది. ఈ గ్రామానికి సమీపంలో ఉన్న ఎగువగిరిజనకాలనీ నుంచి అటవీ, చెరువుకు సంబంధించిన భూములున్నాయి. గతంలో రోడ్డు నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేసినప్పటికీ ఆంక్షలున్నందున రోడ్డు నిర్మాణం జరగలేదు. అయితే ఇటీవల అటవీ అధికారులు రాకపోకలు సాగించడానికి వీలుగా కాలి బాటలు ఏర్పాటు చేసుకున్నారు. అలాగే అటవీ భూమి ఆక్రమణలకు గురి కాకుండా ఉండేలా ట్రెంచ్ కొట్టారు. దీనిని ఆసరా చేసుకున్న కూటమి ప్రభుత్వంలోని నాయకులు నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకుని, జిల్లాధికారుల ద్వారా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించుకున్నారు. అంతే చక చకా పనులు పూర్తిచేసేలా కింద స్థాయి అధికారులు పనులు చక్క బెడుతున్నారు. రోడ్డు పనులు ఇంత త్వరగా పూర్తి చేయడంపై మండల ప్రజలు ఆశ్చర్యానికి గురి అవుతున్నారు.

ఉపాధి నిధులు మంజూరు

పెద్దల తోటకు వేసే రోడ్డుకు ఇటీవల ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మళ్లించిన విషయం తెలిసిందే. దీనిని తమకు అనుకూలంగా మార్చుకుని, జిల్లాధికారుల ద్వారా తోటకు రోడ్డు వేసుకునేందుకు ఎల్లసిరి ఎగువ గిరిజన కాలనీని చూపించి, నిధులు మంజూరు చేయించుకున్నారు. ప్రస్తుతం వేస్తున్న రోడ్డు పెద్దలతోట వద్దకు తప్ప ఆ తరువాత కనీసం కాలిబాట కూడా లేకపోవడం విశేషం.



రోడ్డు పనులకు మట్టిని ఎల్లసిరి చెరువులో తీయడంతో పడిన గుంతలు

ట్రెంచ్ కొట్టారు

రోడ్డు నిర్మాణం చేసే ప్రాంతం అటవీ ప్రాంతం కాదు. అటవీశాఖాధికారులు ఇప్పటికే ట్రెంచ్ కొట్టి ఉన్నందున అక్కడ వరకే వారి హద్దు మిగిలింది. ప్రభుత్వ భూమి అయినందున రోడ్డు నిర్మాణం చేపట్టాం.

– జగదీష్, ఇన్‌చార్జి ఏఈ, పీఆర్, చిట్టమూరు

కలెక్టర్ ఆదేశాల మేరకు నిధులు మంజూరు


ఎల్లసిరి ఎగువ గిరిజన కాలని నుంచి వేస్తున్న మెటల్ రోడ్డుకు నిధులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పల్లె పండుగలో భాగంగా ఉపాధి పథకం నిధులు రూ.15 లక్షలు మంజూరు చేశాం. దీంతో పనులు చేపట్టి పూర్తి చేస్తున్నాం. ఇక్కడ అటవీ భూమి ఉందన్న విషయం తనకు తెలియదు. విచారణ చేస్తాం.

– శ్రీనివాసరావు, డీఈ, పంచాయతీరాజ్

జాతర.. జగమంత వైభవం

తూర్పుకనుమూరు తీరప్రాంతం గ్రామం.. మంగళవారం.. అక్కాచెల్లెళ్ల జాతర ప్రారంభం .. జగమంత వైభవంగా సాగింది. చెల్లెలు పోలేరమ్మ గంగమిట్టపై కొలువుదీరింది. అక్క ముత్యాలమ్మ బంగారు చీరలో దర్శనం ఇచ్చింది. ఈ వైభవం తిలకించడానికి జగమంత జనం తరలివచ్చింది.

- గంగమిట్టపై కొలువు దీరిన పోలేరమ్మ
- బంగారు చీరలో దర్శనమిచ్చిన ముత్యాలమ్మ





బంగారు చీరలో దర్శనమిస్తున్న ముత్యాలమ్మ, అమ్మవారి ఆలయం ఎదుట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

చిల్లకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ముత్యాలమ్మ దేవస్థానంలో మంగళవారం అమ్మవారి జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. చిల్లకూరు మండల తీరప్రాంతంలోని తూర్పుకనుపూరులో గంగమిట్టపై ఉన్న పోలేరమ్మ ఆలయంలో తాత్కాలికంగా వేసిన ‘తాటి ఆకుల గుడిసెలో పోలేరమ్మ ప్రతిమను మంగళవారం రాత్రి నిలుపుదల చేశారు. ఆదివారం ప్రారంభమైన ఘటోత్సవం కొమరావారిపాళెం, ఈదలవారిపాళెం, రావులవారిపాళెం మీదుగా తూర్పుకనుపూరునకు మంగళవారం రాత్రికి చేరుకుంది. కుమ్మరింట్లో అమ్మవారి మట్టి ప్రతిమను తయారు చేసిన అనంతరం చాకలి ఇంటికి తరలించారు. అక్కడ అమ్మవారికి దిష్టి చుక్కపెట్టి గణాచారి అనుమతితో అమ్మను ఊరేగింపుగా తీసుకువచ్చి గంగ మిట్టపై ప్రతిష్ఠించారు.

పక్కాగా ఏర్పాట్లు

జాతరకు భక్తులు లక్షల సంఖ్యలో హాజరుకానుండడంతో దేవాదాయ, రెవెన్యూ, పోలీసుశాఖతో పాటుగా పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సాధారణ దర్శనంతోపాటు, ప్రత్యేక దర్శనం కోసం క్యూలు ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు దాతల సహకారంతో వాటర్ ప్యాకెట్లు అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

అలరించిన నాదస్వర కచేరి

తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలోని జాతర సందర్భంగా మంగళవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నాదస్వర కచేరి భక్తులను అలరించింది. సుమారు 50 మందితో కూడిన ఈ బృందం కంచి కామకోటి పీఠం, టీటీడీ ఆస్థాన విద్వాంసుల ఆధ్వర్యంలో నాదస్వర వాయిద్య కళాకారులు కచేరి చేశారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి



ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన సూచించారు. ఆయన జాతర నిర్వహణకు సబంధించి గతంలో సూచించిన అన్ని ఏర్పాట్లను చేశారా? లేదా అని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలీస్ అవుట్ పోస్టు, వైద్యశిబిరాలు, తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ ఉండేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ గీతాకుమారి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ గోపి, ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బంగారు చీరలో దర్శనమిచ్చిన ముత్యాలమ్మ

దేవతల్లో అక్కచెల్లెలుగా కొలిచే ముత్యాలమ్మ సన్నిధిలో తన చెల్లి పోలేరమ్మకు జరిగే జాతరలో తొలిరోజు ముత్యాలమ్మకు బంగారు చీరను అలంకరించారు. అమ్మవారి మూల విరాట్‌కు అర్చకులు ఉదయం పంచామృతాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దిష్టి తీర్పు తీర్చి, బంగారు చీరతో అలంకరించారు.

భారీ బందోబస్తు

జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. గూడూరు డీఎస్పీ గీతాకుమారి నేతృత్వంలో గూడూరు రూరల్ సీఐ కిశోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు పర్యవేక్షణలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో నాగ వంశీ


సినిమా డైరెక్టర్ నాగవంశీ

తిరుమల: శ్రీవారిని మంగళవారం సినిమా డైరెక్టర్ నాగవంశీ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

140 టన్నుల క్వార్జ్ సీజ్


సీజ్ చేసిన ఖనిజం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురానికి కూత వేటు దూరంలోని పలు ప్రాంతాల్లో శ్రీపొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లా మైనింగ్ అధికారులు దాడులు చేశారు. అక్రమంగా అనుమతి లేకుండా ఉన్న 140 టన్నుల క్వార్జ్ సీజ్ చేసి, వీఆర్వోకు అప్పగించారు.

మార్గ వివాదం.. ప్రయాణికుడికి కష్టం

తిరుపతి అర్బన్: తిరుపతి నుంచి కాణిపాకం ఆలయానికి రోజుకు 24 ట్రిప్పులు తిరగాల్సిన హైర్ బస్సులు(ఆర్టీసీ అద్దె బస్సులు) మంగళవారం కేవలం 6 ట్రిప్పులు మాత్రమే తిరిగాయి. 18 ట్రిప్పులు రూట్ వివాదంతో నిలుపుదల చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కాణిపాకం గ్రామానికి బస్సులు కరువయ్యాయి. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లో పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఇక్కట్లు పడ్డారు. ఆ తర్వాత బస్సు వచ్చినా సీట్లు లేక నిలబడి ప్రయాణించాల్సి వచ్చింది. కాణిపాకం జర్నీ భలే కష్టం గురూ అంటూ అంతా ఆవేదన వ్యక్తం చేశారు.

హైర్ బస్సుల రూట్ వివాదం

తిరుపతి నుంచి కాణిపాకం గ్రామానికి 14 సర్వీసులు నడుస్తున్నాయి. అందులో 8 సర్వీసులు హైర్ బస్సులు(ఆర్టీసీ అద్దెబస్సులు) ఉన్నాయి. టజట బస్టాండ్ నుంచి గరుడవారధి కింది మార్గంలోనే కపిలతీర్థం, అలిపిరి మీదుగా కాణిపాకం పోవాలని తిరుపతి డీఎం బాలాజీ స్పష్టం చేశారు. అందుకు అద్దె బస్సుల డ్రైవర్లు బస్టాండ్ నుంచి వారధిపైన అయితేనే వెళతామని, లేదంటే వెళ్లమని భీష్మించారు. ఉదయం 10.30 నుంచి పూర్తిగా అద్దె బస్సులను కాణిపాకం వెళ్లకుండా నిలుపుదల చేశారు.

● ఐరాల మండలంలో ఇటీవల ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. మండల అధికారులు ఎంపీపీ మోహన్‌ను సంఘటన స్థలానికి రప్పించారు. అత్యవసరంగా పనులు చేయాలని హడావుడిగా ఆయన వద్ద అనుమతి కోసం సంతకాలు తీసుకున్నారు. తీరా రహస్యంగా విద్యుత్ పనులతో పాటు మరిన్ని అభివృద్ధి పనులకు ఆయన ఆమోదం తెలిపినట్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్నా ఎందుకు ఇలా చేశారని మండల అధికారులను ప్రశ్నిస్తే ఎలాంటి సమాధానం చెప్పకుండా దాటవేశారు.

● నగరిలో ఎంపీపీ భార్గవి అనుమతి లేకుండా ఎంపీడీఓ కార్యాలయంలో పలు పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఆ ఎంపీపీ అక్రమ పనులపై ప్రశ్నించగా ప్రస్తుతానికి పనులను ఆపివేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మండల అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పి తప్పించుకుంటున్నారు.

ఎంపీపీలపై ధిక్కారం

సమస్యలు ఆ ఇద్దరి ఎంపీపీలవే కాదు.. దాదాపు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని మండలాల్లో అదే పరిస్థితి నెలకొంది. న్యాయం చేయాల్సిన మండల అధికారులు కూటమి నేతలతో కుమ్మక్కై ఎంపీపీ, ఎంపీటీసీలకు కనీస విలువలు ఇవ్వడం లేదు. వీటిపై నిలదీస్తే కూటమి ఎమ్మెల్యేలు చెప్పిందే చేస్తున్నట్లు ఎంపీడీఓలు వెల్లడిస్తున్నారని ఎంపీపీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కూటమి ప్రభుత్వంలో హక్కులు నిర్వీర్యం
- ఎటువంటి సమాచారం ఇవ్వని వైనం
- ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు
- పరిష్కరించాలని జెడ్పీ సీఈఓ దృష్టికి ఎంపీపీల సమస్యలు


వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్ప, ఎంపీపీలు

చిత్తూరు కలెక్టరేట్ /చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల వ్యాప్తంగా ఎంపీపీలకు పది నెలలుగా తగిన గౌరవం దక్కడం లేదు. స్థానిక సంస్థల్లో కీలకంగా వ్యవహరించే ఎంపీపీల నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. ఇదేమిటని అడిగితే అక్రమంగా కేసులు పెట్టిస్తున్నారు...బెదిరిస్తున్నారు. ఆయా మండలాల్లో ఎంపీపీల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన అభివృద్ధి పనులను జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారు. ఏ అభివృద్ధి పనుల వివరాలు అడిగినా ఎంపీడీఓలు కూటమి ఎమ్మెల్యేలను అడిగి తెలుసుకోవాలని, ఎమ్మెల్యే అనుమతి ఉంటేనే వివరాలు వెల్లడిస్తామని చెబుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటంకాలు సృష్టిస్తున్న 'కూటమి'

ఎంపీపీల హక్కులు, గౌరవానికి, అధికారాలను కూటమి ప్రభుత్వం ఆటంకాలు సృష్టిస్తోందని ఎంపీపీల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ హనుమంతరావు ఆరోపించారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పతో కలిసి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు మంగళవారం జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. పది నెలలుగా ఎంపీపీలకు జరుగుతున్న అన్యాయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, నాయకులు మోహన్, అమరావతి, సురేష్, భార్గవి, సురేంద్రరెడ్డి, యశ్వంత్, జయరాం, శివారెడ్డి, డి.సురేష్, త్యాగ, సంపత్, రాజశేఖర్, మునిలక్ష్మి, గుణశేఖర్‌రెడ్డి, తులసి పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో కక్ష సాధింపులు

కూటమి పాలనలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం దక్కడం లేదని ఆంధ్రప్రదేశ్ ఎంపీపీల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారిక సమావేశాల్లో చెబుతున్న మాటలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలపై కక్ష సాధింపులకు పాల్పడుతోందన్నారు.

ప్రతి పనికి ఎమ్మెల్యే అనుమతులు..

గ్రామాల్లో ఏ చిన్న పని చేయాలన్నా కూటమి టీడీపీ ఎమ్మెల్యే అనుమతి కావాలని ఎంపీడీఓలు చెబుతున్నారన్నారు. ఇలాంటి ధోరణి గతంలో ఎన్నడూ లేదన్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- ప్రభుత్వ అధికారులు ఎంపీపీల విషయంలో ప్రొటోకాల్ పాటించాలి
- ఎంపీపీల నిధుల విషయంలో పాలకవర్గం అనుమతి లేకుండా ఎంపీడీఓలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారి పోకడలను నియంత్రించాలి
- ఎంపీపీ, పాలకవర్గం తీర్మానించిన అభివృద్ధి పనులు అమలు చేయకుండా , ప్రొసీడింగ్స్, వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా దురుద్దేశంతో కాలయాపన చేస్తున్నారు.
- కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా ఎంపీపీ నిధుల్లో చేపట్టే పనులకు పంచాయతీ తీర్మానం కావాలని అధికారులు చట్ట వ్యతిరేకంగా నడుచుకుంటున్నారు.
- ఎంపీపీలకు వాహన అలవెన్సు, గౌరవ వేతనం ఇవ్వడం లేదు.

న్యాయపరంగా పోరాడతాం



"ఎంపీడీఓలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. ఎంపీపీలు తీర్మానించిన పనులు చేయకుండా కూటమి నేతలు చెప్పినవి చేయడం తప్పు. న్యాయ పోరాటం చేస్తాం. – హనుమంతరావు, రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీపీల సంక్షేమ

అధికారులు వేధిస్తున్నారు



మండలంలో తీర్మానించిన పనులను చేసుకోవాలంటే జిల్లాలో కష్టంగా మారింది. అధికారులు నియంతలా వ్యవహరిస్తున్నారు. వీటిపై అన్ని సమావేశాల్లో తెలియజేసినా మార్పు రావడం లేదు. – రెడ్డెప్ప, జిల్లా అధ్యక్షుడు ఎంపీపీల సంఘం

సగం–సగం అంటున్నారు



మండలంలో మా నిధులతో జరిగే పనులను కూటమి నాయకులకు సగం కేటాయించాలని అధికారులు చెప్పడం బాధాకరం. అభివృద్ధి పనులను నా అమనుతి లేకుండా చేపట్టారు. వీటిని ప్రశ్నిస్తే ప్రస్తుతానికి ఆపారు. – భార్గవి, ఎంపీపీ నగరి

హరి.. విరిసిరి

● వైభవంగా కల్యాణ వెంకన్న పుష్పయాగం


శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి పుష్పయాగ మహోత్సవాన్ని వైభంగా నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 7 నుంచి 10 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు 12 రకాల పుష్పాలు, 6 రకాల ఆకులతో స్వామివారికి పుష్ప యాగం నిర్వహించారు. చామంతి, రోజాలు, గన్నేరు, సంపంగి, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, తామర, కలువ, మొగలిరేకులు, మాను సంపంగి పుష్పాలు, తులసి, దవనం, మరవం, బిల్వం, పన్నీరాకు వంటి ఆకులను ఉపయోగించారు. పుష్పయాగానికి 4 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పుష్పాలు విరాళంగా అందాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్ల, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్దన్ రెడ్డి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్, రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు శ్రీ బాలాజి రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘరానా నేరస్తుడి అరెస్టు

తిరుమల : తిరుమలలోని పార్కింగ్ చేసిన ఉన్న కార్ల అద్దాలు పగులకొట్టి చోరీలకు పాల్పడే ఘరానా నేరస్తుడిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీరాముడు తెలిపారు. తిరుమల టూటౌన్ సీఐ కథనం మేరకు.. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన కే. హేమచంద్రారెడ్డి(35) పాతనేరస్తుడు. ఇతను తిరుమలకు వచ్చి పార్కింగ్ చేసిన కార్ల అద్దాలు పగులకొట్టి కార్ల ఉన్న లగేజీతోపాటు విలువైన నగదు, మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను చోరీ చేసేవాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.60 వేలు నగదు, ఒక జత బంగారు కమ్మలు, కారు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీరాముడు తెలిపారు.


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ శ్రీరాముడు

సిమెంట్ లారీ బోల్తా



రాపూరు: రాపూరు–పెంచలకోన జాతీయరహదారిలోని రాపూరు మండలం గుండవోలు సమీపంలో మంగళవారం తెల్లవారు జామున సిమెంట్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. తాటిపత్రి నుంచి గూడూరుకు సిమెంట్ తరలిస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

చిల్లకూరు: టీచర్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఓ విద్యార్థిని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన చిల్లకూరు మండలం తిక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడు మధుబాబు కొంత కాలంగా తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసింది. ఆ విద్యార్థిని తల్లిదండ్రులు మంగళవారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడ్ని చితక బాదారు. దీంతో పాఠశాలలో సహచర ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడ్ని స్టేషన్‌కు తరలించి, విచారణ చేపడుతున్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి పాఠశాలకు చేరుకుని విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారణ జరిపి, నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి అందజేశారు. ఈ విషయమై ఉప విద్యాశాఖాధికారి సనత్‌కుమార్ మాట్లాడుతూ బయాలజీ ఉపాధ్యాయుడు విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించేవాడని నిర్ధారణ అయ్యిందని, దీంతో అతనిపై జిల్లా అధికారులు వేటు వేసే అవకాశం ఉందన్నారు. నెల కిందట మండలంలోని ఉడతావారిపాళెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కూడా ఇలాగే ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడని గుర్తుచేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కీచక ఉపాధ్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్టు చిల్లకూరు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్ సస్పెండ్

తిరుపతి ఎడ్యుకేషన్ : చిల్లకూరు మండలం, తిక్కవరం జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ కేవీఎస్.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ పాఠశాలలో బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బీ.మధుబాబు తొమ్మిదో తరగతి విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ నేపథ్యంలో గూడూరు డీవైఈఓ విచారణ చేపట్టారని, ఆయన ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈఓ తెలిపారు.

నిర్లక్ష్యం... అవగాహన లోపం..


స్ట్రెక్చర్ తోసుకు వెళుతున్న రోగి సహాయకులు

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రి న్యూరాలజీ విభాగంలో చికిత్స పొందుతున్న చిన్న రంగయ్యను కుటుంబ సభ్యులు అవగాహన లోపంతో వైద్యులు రమ్మన్నారని భావించి వార్డు నుంచి ఓపీకి తీసుకువచ్చారు. మంగళవారం ఓపీ ఉండడంతో వార్డులో లేవలేని స్థితిలో చికిత్స పొందుతున్న చిన్న రంగయ్యను వార్డు నుంచి స్ట్రెక్చర్ పై తీసుకురావడం ఆస్పత్రిలో నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. వార్డు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రోగిని వార్డు నుంచి తరలించిన నర్సింగ్ స్టాఫ్ వారిని ప్రశ్నించకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్ట్రెక్చర్‌ను రోగి సహాయకులే తోసుకుంటూ ఓపీ వద్దకు రాగా వైద్యులు ఇక్కడికి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. మిమ్మల్ని ఎవరు రమ్మన్నారు.. ఎందుకు వచ్చారని వైద్యులు గట్టిగా చెప్పడంతో తిరిగి రోగిని న్యూరాలజీ వార్డుకు తరలించారు. రోగిని తీసుకువచ్చే క్రమంలో ఎంఎన్ఓ సిబ్బంది లేకపోవడం గమనార్హం.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

– సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఈనెల 27వ తేదీన నిర్వహించే మండల ప్రజాపరిషత్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీ అయిన స్థానాలకు ఈనెల 27వ తేదీన మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యుల ఎంపికకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రామకుప్పం (మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు), తవణంపల్లి (మండల పరిషత్ అధ్యక్షుడు), విజయపురం (ఉపాధ్యక్షుడు), సదుం (మండల పరిషత్ అధ్యక్షుడు), తిరుపతి (మండల పరిషత్ అధ్యక్షుడు), పెనుమూరు, పీలేరు (కో ఆప్షన్ సభ్యుల) స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికలకు ఎంపీడీఓలు పీవో లుగా వ్యవహరిస్తారన్నారు. ఎన్నికల పర్యవేక్షణకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. సభ్యులు తగినంత మంది హాజరుకాకపోతే ఈనెల 28వ తేదీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. డీఆర్ఓ మోహన్‌కుమార్, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, తదితర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మృతి


మాదేష్ మృతదేహం

తడ: పెరియవట్టు గ్రామం వద్ద ఈ నెల 23వ తేదీ కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో గాయపడి చెన్నై స్టాన్లీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాదేష్(21) విద్యార్థి సోమవారం రాత్రి మృతి చెందాడు. విహార యాత్ర కోసం తమిళనాడులోని తాంబరం నుంచి చెన్నైలోని ఓ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇతర మిత్రులతో కలసి ఆదివారం వరదయ్యపాళెంలోని ఉబ్బలమడుగు వాటర్ ఫాల్స్‌కి కారులో వస్తూ రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొని ఓ యువతితో సహా ఇద్దరు మరణించిన విషయం తెలిసిందే. మిగిలిన ఆరుగురు చెన్నైలో చికిత్స పొందుతున్నారు. వారిలో మాదేష్ మృతి చెందినట్టు ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం అందించాయి. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరిందని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

మెట్లోత్సవంలో పాల్గొనడం పుణ్యఫలం

● అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు రాజగోపాలరావు


గోవిందనామ స్మరణలతో సప్తగిరులను అధిరోహిస్తున్న నిర్వాహకులు, భజన మండళ్ల సభ్యులు

తిరుపతి కల్చరల్: పూర్వం నుంచి ఎందరో మహనీయులు మెట్ల మార్గంలో తిరుమలకు నడిచి వెళ్లి స్వామివారి కృపకు పాత్రలయ్యారని, అలాంటి మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలమని అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు రాజగోపాలరావు ఉద్ఘాటించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవంలో భాగంగా మంగళవారం తొలిరోజు అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవం వేడుకగా నిర్వహించారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనంద తీర్థచార్యులు, అన్నమయ్య ప్రాజెక్టు కళాకారులు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 700 మందికిపైగా భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల విజయకేతనం


నవోదయలో ప్రవేశాలకు అర్హత సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాసంస్థల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు విక్రమ్, గోపిక, జీవన్‌సాయి రెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్ యాదవ్, జాహ్నవి, జస్వంత్, మిథున్ మిహాల్, నితీష్‌సాయి, సోహిని, అభ్యుదయతోపాటు మొత్తం 37 మంది నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. 35 ఏళ్లుగా జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్ తదితర ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఆయా విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందడం తమకు గర్వకారణమని తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ అభినందించారు.

'పాపవినాశనం'లో బోటింగ్ ట్రయల్ రన్


పాపవినాశనం డ్యామ్‌లో బోటింగ్ ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

● పర్యాటక కేంద్రం చేస్తున్నారంటూ భక్తుల ఆగ్రహం

తిరుమల: పర్యాటకాభివృద్ధిలో భాగంగా తిరుమలలోని పాపవినాశనం డ్యామ్‌లో తిరుపతి అటవీశాఖ అధికారులు మంగళవారం బోటింగ్ ట్రయల్ రన్ నిర్వహించారు. తిరుమలలోని కుమారధార, పసుపుధార నీరు పాపవినాశనం డ్యామ్‌కు చేరుతుంది. ఈ ప్రాంతంలోనే టీటీడీకి చెందిన పాపవినాశనం తీర్థం, గంగాదేవి ఆలయం ఉంది. భక్తులు పెద్ద ఎత్తున ఈ ఆధ్యాత్మిక క్షేత్రానికి వస్తుంటారు. అయితే, అటవీశాఖ పరిధిలో ఉన్న ఈ ప్రాంతం ఇప్పటి వరకూ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. అకస్మాత్తుగా అధికారులు బోటింగ్ ట్రయల్ రన్ నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆధ్యాత్మిక క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నారంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తనిఖీల కోసమే బోట్లు

"వెంకటేశ్వర నేషనల్ పార్క్, శేషాచలం బయోస్పేర్ రిజర్వ్‌లోని పాపవినాశనం డ్యామ్ చుట్టూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్టు సమాచారం వచ్చింది. తనిఖీల కోసం బోట్‌లు వినియోగించాం. అనంతరం వాటిని వెనుక్కు తీసుకొచ్చాం.
– పి.వివేక్, జిల్లా అటవీశాఖ అధికారి

నోటీస్ బోర్డు

డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి అర్బన్: బీసీ, ఈబీసీ కేటగిరికి సంబంధించిన విద్యార్థులు డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి జ్యోత్స్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఇప్పటివరకు కేవలం 27 దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు. ఆసక్తి ఉన్నవారు టెట్ ఉత్తీర్ణత సాధించిన మార్కుల జాబితా సర్టిఫికెట్, నివాస, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, ఆధార్‌కార్డు జెరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను జతపరచి కలెక్టరేట్‌లోని బీబ్లాక్‌లో మూడో అంతస్తులోని తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. అదనపు సమాచారం కోసం 9441456039, 9346221533 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని కేవీబీ పురం, ఎర్రావారిపాళెం, వెంకటగిరి, తడ, మావిళ్లపాడు మోడల్ స్కూళ్లలో 2025–2026 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న డీఈఓ కేవీఎస్.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 20వ తేదీన ఆయా మోడల్ స్కూళ్లల్లో ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మే 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, పదో తరగతిలో పొందిన మార్కులు ఆధారంగా ప్రవేశం, సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

26న తాళ్లపాక అన్నమయ్య వర్ధంతి

తిరుమల: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవం మార్చి 26వ తేదీన తిరుమలలో టీటీడీ నిర్వహించనుంది. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఊరేగింపుగా బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు నారాయణగిరి ఉద్యానవనాలకు చేరుకుంటారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహించనున్నారు. ఆ తరువాత స్వామివారు ఉభయదేవేరులతో కలిసి ఆలయానికి వేంచేపు చేస్తారు.